

రీ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పకడ్బంధీగా టాక్స్ రివిజన్ సర్వే చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ రెవెన్యూ అధికారులు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఉత్తర్వుల ప్రకారం ఇంటింటి ట్యాక్స్ రివిజన్ సర్వేను ఈనెల 15 వ తేదీ నాటికి వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సూపరింటెండెంట్ నరేంద్ర, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కమిషనర్

ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర

సబ్సిడీలు ఎత్తివేసేందుకు తెరపైకి నగదు బదిలీ - -రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చే సబ్సిడీలను తగ్గించాలన్న దురద్దేశ్యంతో పిడిఎస్ పథకంలో నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'పేదల ఆహార భద్రతపై నగదు బదిలీ ప్రభావం'అన్న అంశంపై వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం , కౌలు రైతు సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ, ఆవాజ్, కె.వి.పి.ఎస్ పలు ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ రైతులకు గిట్టు బాటు ధర అందించేందుకు, పేదలకు తక్కువ ధరలకే ఆహారం అందించేందుకు, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలన్న సంకల్పంతో ప్రజా పంపిణీ వ్యవస్థ ఏర్పడిందన్నారు. ఈ ప్రజా పంపిణీ సంస్థకు 8 దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. అటువంటి ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయింపులో భారీగా కోత విధించిందన్నారు. ఆహార ధాన్యాల నిల్వ చేసే గోదాములను ప్రయివేటీకరణ చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖత తెలియజేయడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి కుటుంబంలోని ఒకొక్కరికి 5 ప్లస్ 5 మొత్తం కలిపి 10 కేజీల బియ్యం సరఫరా చేయాల్సి ఉంటే కేవలం 5 కేజీలు మాత్రమే సరఫరా చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్‌లో నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టిన సమయంలో వామపక్షాలు, ప్రజాసంఘాలు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీలో నగదు బదిలీ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. డీలర్ వ్యవస్థతో పాటు మొబైల్ వ్యవస్థను కొనసాగించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు తీర్మానం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, బికెఎంయు జిల్లా కార్యదర్శి నందిపాడు రమణయ్య, రైతు సంఘం అధ్యక్షులు ఎస్‌కె షాన్‌వాజ్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, జిల్లా అధ్యక్షులు పి.శ్రీరాములు, రైతు సంఘం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.అన్నపూర్ణమ్మ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రఘురామయ్య, ఆలూరి తిరుపాలు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.వి.రమణ, ఆవాజ్ జిల్లా నాయకులు ఎస్‌కె రియాజ్. వ్య. కాసం నాయకులు నక్క రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

మూడు కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- నెల్లూరు సంక్షేమం

గంజాయి అక్రమ రవాణా చేస్తోన్న వ్యక్తిని గూడూరు రైల్వే స్టేషన్ లో మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు డి ఎస్ఆర్‌పి జి.మురళీధర్ మాట్లాడుతూ పట్టుబడ్డ వ్యక్తి జార్ఖండ్‌కు చెందిన దేవదాస్‌గా గుర్తించారు. రాష్ట్ర డిఐజి సత్య యేసుబాబు ఉత్తరం ప్రకారం ఏకకాలంలో కావలి, నెల్లూరు, గూడూరు స్టేషన్లో తనిఖీలు చేపట్టామన్నారు. ఒరిస్సా నుండి వచ్చిన ప్రతి రైలునూ ప్లాట్‌ఫారంలను తనిఖీ చేశారు. గూడూరు స్టేషన్లో గంజాయిని పట్టుకున్నామని చెప్పారు. దొరికిన గంజాయి మూడు కేజీలుగా దాని విలువ 45 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ సమాచారం తనిఖీలలో పాల్గొన్న రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్ జి. మాలకొండయ్య (నెల్లూరు), వై.చెన్నకేశవ (గూడూరు), ఆర్‌పిఎఫ్ ఏఎస్ఐ సి.కే.ఎన్. రావు, మురళీధర్ అభినందించారు.

'కాకాణి'కి మరో 14 రోజులు రిమాండ్

గుంటూరు సిఐడి కోర్టుకు హాజరు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి మరో 14 రోజులు రిమాండ్ విధించారు. పొదలకూరు రుస్తుం మైనింగ్ కేసులో రిమాండ్‌లో ఉన్న ఆయనకు ఇప్పటికే జిల్లా కోర్టు మరో 14 రోజులు రిమాండ్ పొడిగించింది. మంగళవారం గుంటూరు పోలీసులు పిటి వారెంట్‌తో వాహనంలో గుంటూరుకు తరలించారు. గుంటూరు సిఐడి కోర్టులో కాకాణి గోవర్ధన్‌రెడ్డిని హాజరు పరిచారు. 2022లో టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫొటో మార్ఫింగ్ చేసి, మద్యం సేవిస్తు న్నట్లు పోస్టులు పెట్టారని అప్పట్లో కేసు పెట్టారు. అప్పట్లో ఆ ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా టిడిపి నాయకులు జనవరి 20న రాష్ట్ర డిజిపికి ఫిర్యాదు చేశారు. ఈ కేసు విషయంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మంగళగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు విచారించిన న్యాయమూర్తి మరో 14 రోజులు రిమాండ్ విధించారు. ఇప్పటికే నెల్లూరు కోర్టులో ఉన్న కాకాణికి నెల్లూరు కోర్టు రిమాండ్ 14 రోజులు పొడిగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు గుంటూరు సిఐడి కోర్టు మరో 14 రోజులు రిమాండ్ విధించింది, ఆయనను నెల్లూరు జైలుకు తరలించారు.

వైద్యుడిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నెల్లూరు :సర్వజన ప్రభుత్వ హాస్పిటల్ సర్జికల్ న్యూరాలజీ డిపార్ట్మెంట్లో విధులు నిర్వర్తించాల్సిన డాక్టర్ దినేష్ తన విధులకు గైర్హాజరౌతున్నారని, ఆ వైద్యుడిపై ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు వైద్యశాల అభివృద్ధి కమిటి సభ్యులు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహరిస్తున్న డిప్యూటి కలెక్టర్ బి.మహేశ్వర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ కోఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, సభ్యులు మొగరాల సురేష్, దారా మల్లి, అబిదా సుల్తానా, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు

నిజాయితీగా నిలిచిన షోయబ్‌ను అభినందిస్తున్న దృశ్యం

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలో సోమవారం దొరికిన రూ. 7 లక్షల విలువగల బంగారు ఆభరణాలను నిజాయితీగా పోలీసులకు అప్పగించిన షోయబ్‌ను కందుకూరు ఆర్యవైశ్యులు అభినందించి సన్మానించారు. మంగళవారం కందుకూరు ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో సత్యసాయి జువెలర్స్ యజమాని కాకుమాని ప్రవీణ్ కుమార్ షోయాబ్ ఇంటికి వెళ్ళి బాలుడి కుటుంబం, స్థానికుల సమక్షంలో వెండి చిత్రపటం, వెండి చైను, వెండి పెన్ను, నోట్ పుస్తకాలు అందజేశారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చిన్నతనంలోనే నిజాయితీగా తనకు దొరికిన ఏడు లక్షల రూపాయలు బంగారు ఆభరణాలు పోలీసులకు అప్పగించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఆర్యవైశ్య నాయకులు కోటా కిషోర్, డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, గుర్రం చిన్న అల్లూరయ్య, ముస్లిం నాయకులు షేక్ రఫీ, ఖలీల్, ఫిరోజ్ ఉన్నారు.

పురస్కారం అందజేస్తున్న దృశ్యం

పురస్కారం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు పట్టణానికి చెందిన బద్రిరాజు వెంకట మణి ప్రీతమ్‌కు ఈ సంవత్సరం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో స్టేట్ 10వ ర్యాంకు, జేఈఈ మెయిన్స్ లో 129, జేఈఈ అడ్వాన్స్ లో 234 సాధించాడు.మంగళవారం శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు వారి ప్రతిభను గుర్తించి ఘనంగా సన్మానించి శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. ప్రీతమ్ తల్లి తండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. బద్రిరాజు నారాయణ మూర్తి గణితం, రజని భౌతిక శాస్త్రం లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారుఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మెన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, కాకుమాని ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. . అనంతరం ప్రీతమ్ కు కాకుమాను ప్రవీణ్ వెండి పెన్ను ను అందజేశారు. పురస్కారం అందజేసిన కార్యక్రమంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవా రత్న డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, గుర్రం చిన్న అల్లూరయ్య, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

14న యోగా ప్రదర్శనలు

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ నెల 14 వ తేదీన జిల్లాలో అన్ని చోట్ల యోగా ప్రదర్శన (డెమోనిస్ట్రేషన్) నిర్వహించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, ,మునిసిపల్ కమిషనర్ లతో యోగాంధ్ర కార్యక్రమం పై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వైసిపి పోరాటంతో దిగొచ్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి - నెల్లూరు రూరల్

ఉపాధ్యాయుల బదిలీలలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్లైన్ కౌన్సెలింగ్ విధానంతో 50వేల మంది ఎస్ జి టి ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులు పట్ల వైసిపి ముందుకు వచ్చి ప్రభుత్వం పై ఒత్తిడి చేసి జరిపిన పోరాటం సత్ఫలితాలను ఇచ్చిందని ఎమ్మెల్సీ పరవత్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు ఏకతాటిపై నిలిచి సమిష్టిగా చేసిన పోరాడిన ఫలితంగా ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం దిగొచ్చి ఎస్ జి టి లకు మాన్యవల్ కౌన్సిలింగ్ నిర్వహించేందుకు అంగీకారం తెలిపిందన్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులు జరిపే పోరాటాల్లో వైసిపి వారికి అండగా నిలుస్తుందన్నారు.

ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి-నెల్లూరు :

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 17 రోజుల్లో సమ్మె సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచేదానికి 9 మంది ఐఎఎస్ అధికారులతో కమిటీ వేసి స్కిల్, సెమిస్కిల్ జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ నేటికి అమలుకు నోచుకోకపోవడం దారుణం, దుర్మార్గమన్నారు. 60 ఏళ్ల వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తామని, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. వాటిని అమలు చేయకుండా గత ప్రభుత్వం వ్యవహరించిన విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుం దన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం అవుతాయని కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం రోజులు కావస్తున్న ఇంతవరకు ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. నెల్లూరు కార్పొరేషన్ లో 93 మంది కార్మికులను అర్థాంతరంగా తొలగించడం దారుణమన్నారు. విధుల నుంచి ఆ కార్మికులను నిలిపివేసే ముందు సమాచారం ఇవ్వలేదన్నారు. అదే విధంగా వారికి ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు..జిల్లా అధికారులు వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మె లోకి పోయే దానికి సిద్ధపడతామని తెలిపారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ కి, మేయర్ కి సమ్మె నోటీసు అందజేయడం జరిగింది. సిఐటియు నాయకులు కొండా ప్రసాద్, శివాజీ, కష్ణమూర్తి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, సునీల్, దేశ మూర్తి, లోకేష్, వజ్రమ్మ, భారతి, మారుతి, చంద్రమ్మ, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

టిడిపి శ్రేణుల నిరసన

ప్రజాశక్తి-కందుకూరు

మూడు రోజుల కిందట సాక్షి మీడియాలో అమరావతి రాజధాని మహిళల అసభ్యకరంగా డిబేట్ చేసిన సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కందుకూరు పట్టణంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ర్యాలీ నిర్వాహించారు. ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు మహిళలు భారీగా నిర్వహించారు. అనంతరం సాక్షి దినపత్రికలను దహనం చేశారు. సాక్షి మీడియాను రాష్ట్రంలో నిషేధించాలంటూ మహిళలు నిరసన తెలిపారు.మహిళలకు జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి పై చౌకబారు విమర్శలు చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కందుకూరు పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, ముచ్చు శ్రీనివాసరావు, నాదెళ్ల వెంకటరమణయ్య, బెజవాడ ప్రసాద్, రవిచంద్ర, మహిళలు ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరు శైలజ, అల్లం సుమతి, కంసాని, మయూరి ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరంలోని 33వ డివిజన్, నేతాజీ నగర్ పరిసర ప్రాంతాల్లోకమిషనర్ వై.ఓ నందన్ మంగళవారం పర్యటించారు. డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో భవనాల నిర్మాణాలకు కొలతలు వేసి అసెస్మెంట్ డిమాండ్ లతో సరిపోల్చి చూశారు. అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి నిర్మాణ పనులను నిలిపి వేయడంతోపాటు సంబంధిత వ్యక్తులకు నోటీసులిచ్చి ఛార్జిషీట్ ఫైల్ చేయాలని వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు కమిషనర్ సూచించారు.

బాల్య వివాహాలు సరికాదు

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలంలోని పొట్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లో కిషోర్ బాలికలకు బాల్య వివాహాలను చేయడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి సూపర్‌వైజర్ కామేశ్వరి అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే వివాహాలు చేసుకోవడం వలన పుట్టబోయే బిడ్డలు అనారోగ్యంతో పుడతారన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం. జి. పద్మావతి మహిళా పోలీస్ కే .లక్ష్మీ సుధా ఆయాలు సిహెచ్. పోలమ్మ. డి శ్యామల. అంగన్‌వాడీలు ఎం. కష్ణకుమారి సిహెచ్ .రమాదేవి ఉన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలోని సబ్ యూనిట్ ఆఫీసర్లకు జిల్లా మలేరియా అధికారి ఇ. హుసేనమ్మ ఆధ్వర్యంలో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. డెంగ్యూ ,చికెన్ గునియా మలేరియా పాజిటివ్ కేసులు వచ్చిన ప్రాంతాల్లో తీసుకొనవలసిన నివారణ చర్యలు గురించి అవగాహన కలగజేశారు. అదేవిధంగా కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా తీసుకొనవలచిన ముందస్తు చర్యలపై దష్టి సారించాలని సూచించారు. సహాయ మలేరియా అధికారి వి నాగార్జున రావు జిల్లాలోని సబ్ యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి - సైదాపురం :సైదాపురం పశువైద్యాశాల డాక్టర్ విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న డాక్టర్ బొడ్డు ప్రసాద్‌ను మంగళవారం స్థానిక పశువైద్యాశాల వద్ద సహచర ఉద్యో గులు ఘనంగా సత్కరించారు ఆయన సేవలు అభినందనీయమని కొనియాడారు.

బాలయ్య శకం కొనసాగుతుంది..

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు - వేడుకల్లో మంత్రి ఆనం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సినీ, రాజకీయ, సామాజిక రంగాల్లో నందమూరి బాలకృష్ణ శకం సాగుతోందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ రంగంలో.. రాజకీయాల్లో మకుటం లేని మహారాజు పద్మభూషణ్ నందమూరి నటసింహం బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తొలుత సిటీ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున యువత బైక్ ర్యాలీ నిర్వహించారు.. జై బాలయ్య.. జై శీనయ్య అంటూ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి ముఖ్య నేతలు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ నటించిన చిత్రాలలో సీన్లను ప్రదర్శించారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన దాన్ని విజయవంతం చేయడంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పాత్ర కీలకం అన్నారు. విజయవాడ వెళ్లాల్సిన తనను.. పట్టుబట్టి బాలయ్య జన్మదిన వేడుకలకు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రతేడాదిలాగా ఈసారి కూడా బాలయ్య పుట్టినరోజు వేడుకలు అంబారాన్ని అంటాయన్నారు. బాలకష్ణ అభిమానులకు తోడుగా నీడగా కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఉన్నారని అభినందించారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నాయకత్వం భవిష్యత్తు తరాలకు అవసరమన్నారు. స్వర్గీయ ఎన్టీ రామారావు తో, సీఎం చంద్రబాబు, నందమూరి బాలకష్ణతో కలిసి పనిచేయడం తన అదష్టమని ఆనం వ్యాఖ్యానించారు. పద్మభూషణ్ అవార్డు తీసుకున్న తరువాత జరుగుతున్న వేడుకలు కావడంతో ఎంతో ప్రత్యేకంగా శ్రీనివాసులు రెడ్డి వేడుకలు నిర్వహిస్తున్నారని వివరించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి మాట్లాడు తూ..నాలోని బాధను, భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని నింపే ఏకైక వ్యక్తి నందమూరి బాలకృష్ణ అన్నారు. గూడూరు ఎంఎల్ఏ పాశం సునీల్ కుమార్, రాజగోపాల్ రెడ్డి, పోలంరెడ్డి దినేష్ రెడ్డి , ఆనం రంగమయూర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి , కోటంరెడ్డి సంధ్యతో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కందుకూరులో..

ప్రజాశక్తి-కందుకూరు

సినీ నటుడు నందమూరి బాలకష్ణ జన్మదినోత్సవం సందర్భంగా కందుకూరులో టిడిపి నాయకులు అభిమానులు మంగళవారం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కందుకూరు పట్టణంలోని వెంకటనారాయణ బజార్‌లో ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద ఉదయం 11 గంటలకు జన్మదిన కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, బాలకష్ణ అభిమానులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు పట్టణ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీనివాసరావు, షేక్ రఫీ, వడ్డెళ్ళ రవిచంద్ర, బెజవాడ ప్రసాద్ చిలకపాటి మధుబాబు, చుం దూరి శ్రీను, ముచ్చు వేణు, మంగపాటి శ్రీనివాసరావు, పసుపులేటి రమణయ్య, కొత్తూరు వెంకట సుధాకర్, సవిడిబోయిన వెంకటకష్ణ బాలకష్ణ అభిమానులు కాకుమాని మాల్యాద్రి పిరతల బాలాజీ, వేముల లక్ష్మణ్, పచ్చవ నవీన్, అంజి, చేకూరి వీరాస్వామి కాకుమాని పేరయ్య, కోకిల ఖాదర్ బాషా, మధిర మధు, మమ్ముషా, శేఖర్ ఉన్నారు.



బాలకష్ణ పుట్టినరోజు వేడుకల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి -గుడ్లూరు : నందమూరి బాలకష్ణ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం గుడ్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. బాలయ్య అభి మానులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. పండ్లు పలహారాలు అందజేశారు. బాలయ్య బాబు వర్ధిల్లాలని నేను ఆధారాలు చేశారు

కూలింగ్ బాక్స్ అందజేత :

గుడ్లూరు లోని ప్రభుత్వ వసతి గహం బీసీ హాస్టల్ విద్యార్థులకు నందమూరి బాలకష్ణ పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా బాలయ్య అభిమానులు చల్లని తాగునీరు సేవించేందుకు కూలింగ్ బాక్స్ మంగళవారం రాత్రి అందజేశారు.

గుడ్లూరులో..

సామూహిక యోగాకు విశేష స్పందన

ప్రజాశక్తి-ఉదయగిరి

వేలాది ప్రజలతో స్థానిక రంగనాయకుల స్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక యోగా యోగాంధ్ర కార్యక్రమం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కార్తీక్ శాసనసభ్యులు కాకర్ల సురేష్ సంబంధిత అధికారులు రాజకీయ నాయకులు యువతతో చేపట్టడం విశేష స్పందన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, నోడల్ అధికారి, జిల్లా స్పోర్ట్స్ అధికారి యతిరాజ్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సుజాత, జడ్పీ సీఈవో విద్యారమ, డ్వామా, డి ఆర్ డి ఎ పిడి లు గంగాభవాని, నాగరాజకుమారి పలువురు జిల్లాస్థాయి అధికారులు సమక్షంలో యోగాను ప్రజలందరి చేత యోగాసనాలు వేయించిన యోగా గురువులు చేయించారు. వెనుకబడిన అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఉదయగిరి పర్యాటక ప్రాంతంలో యోగా కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కొనియాడారు. అనంతరం జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం కు జిల్లావ్యాప్తంగా ప్రజలందరూ పెద్దఎత్తున యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇంత సుందరీకరమైన ఉషోదకరమైన ఉదయగిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. మానసికంగా, శారీరకంగా అద్భుత ప్రయోజనాలు ఉన్న యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలన్నదే యోగాంధ్ర కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఇంచార్జ్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సిబ్బంది ప్రజా ప్రతినిధులు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తిప్పలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-బిట్రగుంట

జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు కావలి డి.ఎస్.పి, పి.శ్రీధర్ ఆధ్వర్యంలో బిట్రగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని కప్పరాల తిప్ప గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కావలి డిఎస్పి పి.శ్రీధర్ మాట్లాడుతూ కప్పరాలతిప్ప గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున సరైన పత్రాలు లేని 32 మోటారు బైకులు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బోగోలు మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే బిట్రగుంట పోలీస్ స్టేషన్ నెంబర్ 08626-246233, 9440796338 సెల్ నెంబర్‌కు తెలపాలని, సమాచారం ఇచ్చిన పేర్లను గోప్యంగా ఉంచుతామని బాధ్యత ఉన్న ప్రతి పౌరుడు పోలీసే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కావలి రూరల్ సి,ఐ ,బి. పాపారావు, కావలి రూరల్ పిఎస్ జి రాజేశ్వరరావు, కావలి వన్ టౌన్ పిఎస్ ఎం.డి. ఫిరోజ్, బిట్రగుంట ఎస్ఐ కె.భోజ్య నాయక్, అల్లూరు పిఎస్ కిషోర్ బాబు, జె.కుమార్, ఎం.బాజీ బాబు, ఎస్.కె గౌస్ బాషా, వి. వెంకటేశ్వర్లు, ఎస్సై లతీఫ్ ఉన్నిసా, 60 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-దగదర్తి

మండల కేంద్రమైన దగదర్తి సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను తహశీల్దార్ పి.కృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రోజుకు ఒక సచివాలయం చొప్పున నిర్వహించబడతాయని వారు తెలిపారు. ఈ సెంటర్లో ఆధార్ కార్డు లేని వారికోసం ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఆధార్ కార్డును లేని గిరిజనులకు ఆధార్ కార్డు నమోదు చేసుకోవాలని అంతేగాక ఆధార్ అడ్రస్ మార్పు చేసుకోవచ్చని సూచించారు. చిన్నపిల్లలకు వేలు నమోదు కాకుండా ఉంటే కంటి చూపుతో నమోదు చేసుకోవచ్చని వారు తెలిపారు ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి సీతారాంపురం

సీతారాంపురం మండలంలో నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనల మేరకు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు కొరకు ఉదయగిరి వెళ్లడం జరిగింది. అక్కడ ఎమ్మెల్యే గారు పాల్గొని నందమూరి బాలకృష్ణ అభిమానులతో కలిసి భారీ కేక్ కట్ చేయడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ సినీ రాజకీయ సేవా రంగంలో విశేష సేవలు అందించిన కళామతల్లి ముద్దుబిడ్డ నటసింహం హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ అని కొనియాడారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు తోట మనోజ్, పిడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలు హల్‌చల్..

ప్రజాశక్తి-దగదర్తి

దొంగలు హల్‌చల్ చేస్తుండడంతో రైతులకు కంటిమీద కులుకు లేకుండా ఉన్నారు. వివరాల్లోకెళితే.. మండలంలోని అనంతవరం పంచాయతీలోని పంట పొలాల్లో ఏర్పాటు చేసిన మోటార్లను స్టార్టర్లు వైర్లు రాత్రి వేళలో దొంగలిస్తూ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. అనంతరం పంచాయతీలో సుమారు 17 మోటార్ల సంబంధించిన వైర్లు స్టార్టర్లను తీసుకెళ్లారు. గత నెల కిందట ఈ తరహా లోని సుమారు ఐదు మోటర్ల సంబంధించిన వైర్లు స్టార్టర్లు దొంగిలించారు. రైతులు వాపోతున్నారు. ఒక స్టార్టర్‌ను కొనుగోలు చేసి బిగించాలంటే సుమారు రూ.4000 అదేవిధంగా వైరు కొనుగోలు చేయాలంటే రూ.1000 ఖర్చు అవుతుందని తెలిపారు. దొంగల నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు. అనంతరం గోపసాని పెంచలయ్య అనే రైతు స్థానిక పోలీస్ స్టేషన్‌లోని ఫిర్యాదు చేయడంతో వెంటనే రంగంలో దిగిన ఎస్ఐ జంపాని కుమార్ సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని వారు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సీతారాంపురం

మండలం లోని ప్రసిద్ధిగాంచిన ఘటిక సిద్దేశ్వరం ఆలయంలో మంగళవారం జడ్పీ సిఇఒ విద్యారమ, డ్వామా పిడి గంగాభవాని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రతిష్ట గురించి ఆలయ పూజారి గారిని అడిగి తెలుసుకున్నారు. పురాతన దేవాలయాలలో కటిక సిద్దేశ్వరం ఆలయం ఒకటని చెప్పుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్‌పేటలో ఎక్సైజ్ తనిఖీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని పలు గ్రామాలలో ఎక్సైజ్ సిఐ ఆర్.బి రమణమ్మ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఈ తనిఖీల్లో అనుమ సముద్రం పేట గ్రామ పరిధిలోని ఓ దుకాణంలో తనిఖీలు చేయగా ఆ దుకాణంలోని మహిళ దగ్గర నుంచి 180 మిల్లీలీటర్ల ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు, అదేవిధంగా జమ్మవరం గ్రామంలో 61 సంవత్సరాల వ్యక్తి దగ్గర నుంచి 180 మిల్లీలీటర్ల 7మద్యం బాటిల్స్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం కేసులు నమోదు చేయడం జరిగిందని తెలియజేశారు. ఇలా ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వలు, ఏర్పాటు చేసుకోవడం, అమ్మడం చేయరాదని, అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని, చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు.

కిశోర వికాసంపై అవగాహన

మర్రిపాడులో..

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని మర్రిపాడు సెక్టార్లోని చిలకపాడు అంగన్వాడీ కేంద్రంలో కిశోరీ వికాసంపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమం లో సూపర్వైజర్ రాధ పాల్గొని మాట్లాడుతూ బాలికలకు విద్య, ఆరోగ్యం, పోషక ఆహారం ఆవశ్యకత ఆత్మరక్షణ, భద్రత, లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహలను నిర్మూలించి వారికి జీవనోపాధి కల్పించడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు. సమాజంలో వారికి సమానమైన హక్కులు కల్పించాలన్నారు. బాలికలకు ఆరోగ్య పరీక్షలు, శారీరకంగా వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. సమాజంలో బాలికలను చిన్నచూపు చూడకుండా ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నూర్జహాన్, జ్యోష్ణ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : పెళ్లీడు వయస్సు రాకుండానే వివాహాలు చేయడం వల్ల భవిషత్తులో బాలికలు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కోనే పరిస్థితి వస్తుందని, దానిని దృష్టిలో పెట్టుకుని పెళ్లీడు వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల తెలిపారు. కోవూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని వేగూరు కంద్రిగ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా వారు శిక్షార్హులు అవుతారన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం. శైలజ మాట్లాడుతూ బాలికలు తప్పనిసరిగా చదువుకోవాలని, మధ్యలో చదువు ఆపకూడదు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. సమాజంలో బాలికలు ప్రత్యేక గుర్తింపు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం తెల్మ, కిశోర బాలికలు ఉన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సిడిపిఒ పద్మావతి పాల్గొని మాట్లాడుతూ బాలికలకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, భద్రత, లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను నిర్మూలించి వారికి జీవనోపాధి కల్పించడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుంటారని తెలిపారు. సమాజంలో వారికి సమానమైన హక్కులు కల్పించాలన్నారు. బాలికలకు ఆరోగ్య పరీక్షలు, శారీరకంగా వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్ సుజాత, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లో కిశోర బాలికలకు ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో బాల్య వివాహాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి మాట్లాడుతూ కిశోర బాలికలను ఉద్దేశించి బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల, ఆడపిల్లలు అనారోగ్యానికి గురవుతారని, బాలికలు హోదా, శక్తి పరిణతి లేకపోవడం వల్ల గృహ హింసకు, వృత్తుల వేధింపులకు, సామాజికంగా విడిగా ఉండటం వంటి పరిస్థితులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా చదువు మధ్యలో ఆగిపోవడం, ఆర్థికంగా ఆధారపడే పని చేయలేకపోవడం పేదరికాన్ని చవిచూడాల్సి వస్తుందని, అంతేకాకుండా కాన్పు కష్టం అవడం వల్ల ప్రసూతి మరణాలు, శిశుమరణాలు అధిక శాతంలో జరుగుతూ ఉండడం మనం చూస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.విజయలక్ష్మి, ఎం.సుశీలమ్మ, పి.సావిత్రి, పి.షాకిరా బేగం, జి.ఇందిరా, కిశోర బాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

ప్రజాశక్తి-కొండాపురం

ఆక్రమణ భూమిలో నిర్మించిన ఉన్న రూములు

ఎపి మోడల్ స్కూల్, పోలీస్ స్టేషన్, కలిగిరి -కందుకూరు మెయిన్ రోడ్ ఆనుకొని ఉన్న కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కొండాపురంకు చెందిన ఒక వ్యాపారస్తుడు ఆక్రమించాడు. ప్రభుత్వ భూమిని తమ పంచాయతీకి అప్పగించాలని గానుగపెంట సర్పంచ్ ఎం.మల్లికార్జున అన్నారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సర్వే నెంబర్ 18లో ఉన్న గానుగపెంట పంచాయతీకి సంబంధించిన భూమిని కొండాపురంకు చెందిన వ్యాపారస్తుడు మెంట సుధాకర్ ఆక్రమించాడు. దానిలో ఐదు రూములు నిర్మించి ఆ భూమిని కోట్ల రూపాయలకు విక్రయించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఒకవైపు ప్రభుత్వ భవనాలన్నీ సమీపంలో ఉండటం రోడ్డు ఆనుకుని ఉండడంతో దాని విలువ రూ.కోట్లల్లో ఉందని దానిని ఆనుకుని ఉన్న తన పొలాన్ని అక్కడే పెట్టి ప్రభుత్వ భూమి విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దానికి ప్రభుత్వ అధికారులు కూడా సహకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికి రెండుసార్లు తాను ఫిర్యాదులు చేసి తమ భూమిని తమ పంచాయతీకి అప్ప చెప్పాలని కోరామని అయినా అధికారులు స్పందించడం లేదన్నారు. ఉన్నత అధికారులు స్పందించి ప్రభుత్వ సంపద ఆక్రమణకారుల నుండి కాపాడి తమ పంచాయతీకి అప్ప చెప్పాలని దాని ద్వారా పంచాయతీ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

వీధి ఆక్రమణను తొలగించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-కొడవలూరు

కొడవలూరు మండలం మిక్కిలింపేట పంచాయతీ గ్రామస్తులు తమ గ్రామంలోని వీధి ఆక్రమణను తొలగించాలని మంగళవారం కొడవలూరు ఎంపిడిఒ వెంకట సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. బిసి ఎస్టి గ్రామాలకు వెళ్లే వీధిని అదే గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి కొంత ఆక్రమించుకుని స్తంభాలు నాటి కంచె వేశారని దానివల్ల తమ గ్రామాలకు వెళ్లాలంటే దారి లేక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఆ స్తంభాలను కంచెను అధికారులు తొలగించి తమ గ్రామానికి రాకపోకలు కొనసాగించే విధంగా చూడాలని ఎంపిడిఒకు విన్నవించారు. కార్యక్రమంలో మహేంద్ర, రాఘవేంద్ర, జయమ్మ, వరమ్మ తదితరులున్నారు.

నేడు 'స్వర్ణాంధ్ర' యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర -2047 విజన్ యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యంగా, సంబంధిత శాఖల అధికారులు, నియోజకవర్గ పరిధిలోని పార్టీ ప్రతినిధులతో ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11 గంటలకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరుగుతుందని మంత్రి కార్యాలయం మంగళవారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా, ప్రధాని నరేంద్ర మోడీ - 2047 నాటికి వికసిత భారత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన స్వర్ణాంధ్ర -2047 యాక్షన్ ప్లాన్ అమలుకు దిశానిర్దేశం చేయాలని ఉద్దేశంతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో శాఖల వారీగా ప్రాధాన్యత కలిగిన అంశాలు, అభివృద్ధి ప్రణాళికలు, అమలు చేయాల్సిన కార్యాచరణపై చర్చ జరగనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని తహశీల్దార్లు, మండల పరిషత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు ఎన్డీఏ కూటమి నాయకులు తెలుగుదేశం జనసేన బిజెపి మండల అధ్యక్షులు అందరూ ఈ సమావేశంలో తప్పక పాల్గొనాలని కోరారు.

డిఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మోసాలు చేసే వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజవర్గం న్యూ సమైక్య మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియే షన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 'నెల్లూరు జిల్లాలో మ్యారేజ్ మీడియేటర్స్ ముసుగులో అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులను మోసం చేస్తున్న వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కావలి డీఎస్పీ శ్రీధర్‌కి జిల్లా అధ్యక్షులు గున్నం శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. వారు చేస్తున్న మోసాలకు నిజాయితీగా పనిచేస్తూ అసోసియేషన్‌లో గుర్తింపు పొందిన వాళ్లకు కూడా చెడ్డపేరు వస్తుందని, ఇలాంటి వాళ్ళని కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటే తప్ప మ్యారేజ్ అవస్థలో జరిగే మోసాలకి చెక్ పెట్టలేమని వీళ్ళని కఠినంగా శిక్షించాలన్నారు. మ్యారేజ్ మీడియేటర్స్ వ్యవస్థకి ప్రజల్లో నమ్మకం కలిగేలా బాధ్యతగా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆయనతోపాటు నూతనంగా ఏర్పడిన కావలి నియోజకవర్గ కార్యవర్గంతో కలిసి కావలి నియోజక వర్గం ఇన్‌ఛార్జి, కావలి అధ్యక్షులు నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షులు సుందరయ్య. మహిళా అధ్యక్షురాలు ప్రియదర్శిని అమరావతి అమ్మ జేఏసీ. నెంబర్. సరళ, కోటా సుబ్రహ్మణ్యం, నియోజవర్గ ఇన్‌ఛార్జులు, మండల అధ్యక్షులు. న్యూ సమైక్య సభ్యులు ఉన్నారు.

'ఉపాధి'ని పటిష్ట పరచాలి

ప్రజాశక్తి-కావలి

వినతపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

కావలి మండలంలో ఉపాధి హామీ పనిని మరింత పటిష్టంగా నిర్వహించాలని కోరుతూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కావలి మండల పరిషత్ కార్యాలయంలో ఎం.పి.డి.ఒ. సిహెచ్.శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం యేటా 2లక్షల 50 వేలకోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 200 రోజులు పనిదినాలు, రోజుకు రూ.600 కూలి కల్పించాలని కోరారు. వేసవి రోజుల్లో సైట్‌లో మంచి నీళ్లు, మజ్జిగ పంపిణీ చేయించాలన్నారు. పే స్లిప్లు ఇచ్చి, వారంవారం వేతనాలు పంపిణీ చేయించాలని కోరారు. గ్రామాలలో అన్ని తరగతుల వారికి పనులు కేటాయించాలని, పట్టణాల్లోని పేదలకు కూడా ఉపాధి హామీ పనులను వర్తింపజేయాలని తాము కోరుతున్నామని, ప్రభుత్వానికి తెలియజేయాలని తాళ్లూరు మాల్యాద్రి ఎం.పి.డి.ఒ.ను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కావలి మండల అధ్యక్ష, కార్యదర్శులు పి. సీతారామయ్య, మారుపూడి రాధా కృష్ణయ్య, ఆర్.సీతారామయ్య, ఎన్.నరేష్, కె.వి.పి.ఎస్. నాయకులు కె. జాన్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల విషయంలో అలసత్వం విడనాడాలి

ప్రజాశక్తి-కోవూరు

రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వ గృహాలు నిర్మించుకుంటున్న ఎస్‌సి ఎస్‌టి బిసి లబ్ధిదారుల నిర్మాణాలు మరింత వేగవంతం అయ్యేలా సంబంధిత సచివాలయ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ అన్నారు. కోవూరులోని ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం సచివాలయ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల గృహ నిర్మాణాలు చేసుకునే ఎస్‌సి ఎస్‌టి బిసి లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం పెంచిన నేపథ్యంలో సంబంధిత లబ్ధిదారుల్లో నిర్మాణాలు వేగవంతం అవడమే కాకుండా సకాలంలో పూర్త య్యేలా తగుచొరవ తీసుకోవాలన్నారు. విధి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించే ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రాంతాలలో లోఓల్టేజ్ సమస్య కారణంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతూ పలు ప్రాంతాల ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో మంగళవారం ఆ సమస్యను సరిచేసిన విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించారు. పట్టణంలోని 7 ప్రాంతాలలో 63 కెవి ఓల్టేజ్‌ను 100 కెవి ఓల్టేజ్ కెపాసిటీగా పెంచుతూ వాటికి తగిన విధంగా విద్యుత్ సామాగ్రిని అమర్చారు. దాంతో లోఓల్టేజ్ సమస్య ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ఇకపై అటువంటి సమస్య రాదని వారు తెలిపారు. ఈ సమస్యను సరి చేసేందుకు దాదాపు గంటపాటు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అమలుచేయాలి

ప్రజాశక్తి-కావలి

కావలి గ్రామీణ కార్మికుల రక్షణ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భూమిలేని నిరుపేదలకు మిగులు భూమిని పంపిణీ చేయాలని కోరుతూ మంగళవారం ఎపి వ్యవసాయ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కావలి తహశీల్దారు పి.శ్రావణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులకు సమగ్ర కేంద్ర చట్టాన్ని చేపట్టాలని ఉపాధి హామీ పథకం పనిని దినాలు 200 రోజులు కల్పించి, రోజు కూలీ రూ.700 కనీస వేతనం ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని నిరుపేదలకు మూడు సెంట్లు స్థలం రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా అమలు చేయాలని గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదలకు భూ పంపిణీ చేయాలని, కేరళ రాష్ట్రం వలె గ్రామీణ వ్యవసాయ కార్మికులకు సమగ్ర ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ ఎన్నికల హామీలు తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు, పి.నరసింహారావు, పి.బోస్, తదితరులున్నారు.

వైభవంగా పల్లకి సేవ

ప్రజాశక్తి-కోవూరు

కోవూరులోని గాంధీపార్కు సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేకువజామునే స్వామివారికి ఆలయ ప్రదాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా తమ్మినేని రవికుమార్, కె.అరు ణమ్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో చేవూరు కష్ణప్రసాద్, బ్రహ్మోత్సవ నిర్మాణ కర్తలు మొలకల శ్రీనివాసులురెడ్డి, గాదిరాజు చక్రవర్తి, హరి, భక్తులున్నారు.

'కొమ్మినేని'పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కావలి : సాక్షి ఛానల్‌లో నిర్వహించిన డిబేట్‌లో మహిళలపై అసభ్యకరంగా మాట్లాడటాన్ని నిరసిస్తూ, కొమ్మినేని శ్రీనివాస రావు, కృష్ణ ప్రసాద్‌లపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ, కావలి కూటమి పార్టీల మహిళలు, మహిళా సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. సెల్ఫీ పాయింట్ వద్ద నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, కావలి పట్టణ టిడిపి మహిళా అధ్యక్షురాలు అర్షియా బేగం, బిజెపి రాష్ట్ర కార్యదర్శి అంచిపాక కమల మాట్లాడారు. మహిళలు పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షించాలని, సాక్షి టీవీ ఛానల్ మూసేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మావతి శ్రీదేవి, జనసేన వీర మహిళలు, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : అమరావతి రాజధాని పరిసర ప్రాంతాలు వేశ్యల రాజధాని అని సాక్షి డిబెట్ ఛానెల్లో చెప్పడం మహిళల మనోభావాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కోవూరు పురవీధులో మహిళలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ కేవలం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆ ఛానల్లో ఇటువంటి అను చేయడంతో మహిళల మనోభాలు తవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ఆ చానెల్ను, పేపర్ను మూసివేయాలంటూ పెద్దఎత్తున ప్లకార్డులు చేబూని నిరసన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-కావలి : ఇటీవల కాలంలో మహిళను కించపరిచి మాట్లాడడం విపరీతమై పోయిందని, దళిత బాలికలపై అత్యాచార హత్యలను ఖండించి నేరస్తులను కఠినంగా శిక్షించాలని, ప్రత్యక్ష ప్రసారంలో చర్చలో కృష్ణంరాజు మహిళలను అసభ్యకరమైన వ్యాఖ్యలతో కించపరచడం అత్యంతం గర్హనీయమని మహిళా సామజిక కార్యకర్త, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలకొండ శారద ఖండించారు. అమరావతి ఎవరికి నిలయంగా ఉందో తప్పుగా వ్యాఖ్యానించిన కృష్ణంరాజు తక్షణమే బహిరంగంగా మహిళలందరికీ క్షమాపణ చెప్పి, తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలన్నారు. అసహ్యకర వ్యాఖ్యానాలను కొనసాగించిన కొమ్మినేని శ్రీనివాసరావుపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుని, ఇకపై ఇలాంటి అసంబద్ధ వ్యాఖ్యలకు చోటివ్వకుండా హెచ్చరింపు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వికసిత్ కృషి సంకల్ప అభియాన్

ప్రజాశక్తి-మర్రిపాడు

చేజర్ల మండల వ్యవసాయ అధికారి శశి ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు వారు వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వరి పరిశోధన కేంద్రం డాక్టర్ ప్రసన్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి, వరి రకాల గురించి వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి సుబ్బా రెడ్డి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న ఉద్యాన పథకాల గురించి వివరించగా, శాస్త్రవేత్త డాక్టర్ సురేఖ దేవి భూసార పరీక్షలో ఉన్న ఆధునిక పద్ధతుల గురించి క్లుప్తంగా రైతులకు వివరించారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని తదనుగుణంగా ఎరువుల యాజమాన్యం పాటించాలని తెలిపారు. వివిధ పంటలలో వేపనూనె పిచికారి ఆవశ్యకత గురించి రైతులకు తెలియజేశారు. కె.వి.కె శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి రైతులకు తెలియజేశారు. వరి, మినుము, పెసరను ఆశించే వివిధ పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు. అదేవిధంగా వీక్షిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మందుల పిచికారి డ్రోన్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు శిరాజుద్దీన్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణయ్య, నీటిసంఘం అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట :

అనుమ సముద్రం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు వారి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానం నెల్లూరు నుంచి విచ్చేసిన డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ నూతన వరి వంగడాలు, మేలైన యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. అదేవిధంగా తిరుపతి నుంచి విచ్చేసిన డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ పశుపోషణ దాని వల్ల కలిగే ప్రయోజనాలను గురించి, వివరించారు. వివిధ రకాల పశువుల రకాలు వాటి వల్ల లభించే పోషకాలను గురించి విపులంగా తెలియజేశారు. అలాగే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రైమరీ, సెకండరీ ప్రాసెసింగ్ ఎలా చేసుకోవాలో వివరిస్తూ విలువ ఆధారిత పదార్థాల తయారీ ద్వారా అదరపు ఆదాయాన్ని ఆర్జించవచ్చని సూచించారు. వ్యవసాయ శాఖ ఎఒ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో అనుముసముద్రం ఎఇఒ భాగ్యలక్ష్మి, విఎఎ శ్రీహరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి, అంగన్‌వాడీ టీచర్స్, ఎస్‌హెచ్ జి మెంబర్స్, ఎపిఎం, రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-దుత్తలూరు

దుత్తలూరు మండలం నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డిఎంహెచ్ఒ డాక్టర్ సుజాత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్ రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యశాలలో వార్డులో కాన్పుల గది పరిసరాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు గురించి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రైవేట్ హాస్పిటల్‌లో ఉండే ప్రతి స్పెషల్ ఎన్రోల్మెంట్ మన గవర్నమెంట్ హాస్పిటల్‌లో కూడా ఉందని పేద ప్రజలకు వివరించి రానున్న రోజుల్లో మరింత ఓపి కాన్పుల శాతాన్ని పెంచీ ప్రైవేట్ హాస్పిటల్ కంటే గవర్నమెంట్ హాస్పిటల్ ఎంతో మంచిదని ప్రజలు తెలుసుకునేలా చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హరీశ్ రెడ్డి, రియాజ్, ప్రసాద్, ఎల్ఎల్‌పి పిహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ - నెల్లూరు
కార్యాలయము నిప్పో ఎదురుగా, పినాకిని వనవిహార్ కాంప్లెక్స్, ఎ.కె.నగర్ (పోస్ట్), నెల్లూరు-524004. ఫోన్ : 0861-2327109

సంక్షిప్త టెండరు ప్రకటన

సూచిక : వేట్ ట్రాక్టర్ ప్లవింగ్ /2025-26/143 తేది: 09-06-2025

నెల్లూరు డివిజన్ పరిధిలోని సుమారు **2207.94** హెక్టార్లలో గల జామాయిల్ తోటలలో ముడి మరియు అంతర దున్నకము పనిని 45 హెచ్.పి లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యం గల ట్రాక్టర్లను ఉపయోగించి దున్నుటకు ట్రాక్టర్ల యజమానుల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు ఫారము మరియు ఇతర వివరములను టెండరు ఫారం ఒక్కింటికి రూ.266/- లు చొప్పున నగదు లేదా డివిజనల్ మేనేజర్, ఎ.పి.ఎఫ్.డి.సి. లిమిటెడ్ వారి పేరు మీద తీయబడిన డి.డి. రూపంలో చెల్లించి పైన చెప్పబడిన అడ్రస్‌లో తేది: **12-06-2025** నుండి తేది: **18-06-2025** మధ్యాహ్నం 12.00 గం॥ల వరకు టెండర్ ఫారము పొందగలరు. పోస్ట్ ద్వారా కావలసినవారు రూ.40/- లు అదనముగా చెల్లించవలెను. ఒక ప్యాకేజీకి కొనుగోలు చేయబడిన టెండర్ ఫారము అదే ప్యాకేజీకి ఉపయోగించవలెను. వేరొక ప్యాకేజీకి ఉపయోగించరాదు. టెండర్ స్వీకరించు చివరి తేది: **18-06-2025** మధ్యాహ్నం 1.00 గం॥ల వరకు అదే రోజు **18-06-2025** మధ్యాహ్నం 03.00 గం॥లకు పైన తెలిపిన అడ్రస్ నందు టెండర్లు తెరువబడును. **18-06-2025** తేదిలో అమ్ముడుపోని ప్యాకేజీలు మరలా తేది: **27-06-2025, 02-07-2025, 10.07.2025** మరియు **17.07.2025** తేదీలలో టెండర్లు పిలవబడును.

డివిజనల్ మేనేజర్, **పి.శారద,** ఎ.పి.ఎఫ్.డి.సి.లిమిటెడ్, నెల్లూరు డివిజన్.